క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ముత్తంపేట్ ఫీడర్‌లో ఆదివారం మరమ్మతులు చేయనున్నట్లు ఏఈ రవీందర్ తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ముత్తంపేట్, పార్డీ, కుంబారీ, శీర్షా గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: చలి తీవ్రతతో బాధపడుతున్న పట్టణంలోని యాచకులకు శనివారం శ్రీ మిత్రా సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీమిత్రా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి తిరుపతి, సభ్యులు ప్రభాకర్, బాలకృష్ణ, రాకేశ్, మంజుల, స్రవంతి, శ్రీలత, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

వాంకిడి: మండల కేంద్రంలోని సాయి గోపాల పాఠశాలలో శనివారం టీఎస్ యూటీఎఫ్ సంఘ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు సమక్షంలో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జాదవ్ సుభాష్, ప్రధాన కార్యదర్శిగా బండె హరీష్, ఉపాధ్యక్షులుగా డోంగ్రి రవికుమార్, అరుణ, కోశాధికారిగా పి.జగదీష్, కార్యదర్శులుగా దశరథ్, సాయికుమార్, లక్ష్మణ్, కాలేరాం, కిరణ్‌కుమార్, రాథోడ్ సులబాయి, ఆరిఫ్‌లను ఎన్నుకున్నారు.

ఉత్తమ లెక్చరర్‌ను సన్మానించిన సిబ్బంది



జ్ఞాపికతో సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రయ్య గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా ఉత్తమ లెక్చరర్‌గా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాల సిబ్బంది, విద్యార్థులు శనివారం లెక్చరర్ చంద్రయ్యకు ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని తీరందాజ్ టాకీస్ సమీపంలో చెత్తకుప్పలో అచేతనంగా పడి ఉన్న కాటం లక్ష్మి అనే వృద్ధురాలిని పోలీస్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. వృద్ధురాలి పరిస్థితి గురించి స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ కాగా, కానిస్టేబుల్ కిరణ్‌కుమార్‌తో పాటు నవేగాంబస్తీకి చెందిన వివేకానంద యూత్ సభ్యులు వృద్ధురాలిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వృద్ధురాలి పట్ల మానవత్వం చూపిన కానిస్టేబుల్‌తో పాటు యూత్ సభ్యులను పలువురు అభినందిస్తున్నారు.

కాంగ్రెస్ కార్యవర్గం

వాంకిడి: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా శనివారం కనర్‌గాం గ్రామ కమిటీని ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ తెలిపారు. అధ్యక్షుడిగా జాడి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా మంద సాయి, కార్యదర్శిగా మొహర్లే సోమ, కార్యవర్గ సభ్యులుగా కుద్మెత లింబారావు, జాడి సునీల్, మొహర్లె అన్నారావు, గౌరవ అధ్యక్షుడిగా జైస్వాల్ రామ్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. నాయకులు దుర్గం జీవన్, గుర్నులె మెంగాజీ, దుర్గం ప్రశాంత్ పాల్గొన్నారు.

చతుర్విధ ప్రక్రియలు రావాలి



విద్యార్థితో చదివిస్తున్న చంద్రశేఖర్

కెరమెరి: విద్యార్థులకు చతుర్విధ ప్రక్రియలు రావాలని కెరమెరి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని కెలిబి, కెలికే, భోలాపటార్, లేండిగూడ ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించారు. బోర్డుపై రాయించారు. రికార్డులు పరిశీలించారు.

‘చెత్తశుద్ధి’పై పట్టింపేది..?

- వరదల్లో కొట్టుకుపోయిన సెగ్రిగేషన్ షెడ్లు
- వాంకిడిలో నూతన షెడ్డు నిర్మాణానికి శ్రీకారం
- ఐదు నెలలు గడిచినా అసంపూర్తిగానే..
- చిక్లీవాగు తీరంలో చెత్త పడేస్తున్న సిబ్బంది



వాంకిడిలోని చిక్లీ వాగు ఒడ్డున పడేసిన చెత్త

వాంకిడి: ప్రభుత్వం గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యత కల్పించడంతో పాటు, చెత్త నుంచి సంపదను రాబట్టేందుకు సెగ్రిగేషన్ షెడ్‌ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఉపాధిహామీ నిధుల నుంచి సుమారు రూ.3 లక్షలతో గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున చెత్తశుద్ధి కేంద్రాలను నిర్మించింది. గ్రామంలోని తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. ఎరువును రైతులకు విక్రయించడం.. హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసే నర్సరీలలో మొక్కల పెంపకానికి వినియోగించడం చేయాలి. తద్వారా చెత్త నుంచి సంపద రాబట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. కానీ క్షేత్రస్థాయిలో మండలంలోని ఏ ఒక్క పంచాయతీలోనూ అనుకున్న స్థాయిలో చెత్తశుద్ధి కార్యక్రమం జరగడం లేదు.

వరదలో కొట్టుకుపోయిన షెడ్లు..

2021లో వచ్చిన వరదలకు వాంకిడి పరిధిలోని సెగ్రిగేషన్ షెడ్డుతోపాటు మండలంలోని ఖమాన, కనర్‌గాం జీపీల్లో నిర్మించిన షెడ్లు సైతం వరదలో కొట్టుకుపోయాయి. ఖమాన, కనర్‌గాం జీపీలపై దృష్టి సారించని అధికారులు వాంకిడి జీపీలోని సెగ్రిగేషన్ షెడ్డుపై మాత్రం ప్రత్యేక దృష్టి సారించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ సర్వే నిర్వహించిన కేంద్రం జిల్లాలోని ఉత్తమ జీపీగా వాంకిడి జీపీని ఎంపిక చేసింది. దీంతో కేంద్రం నుంచి అప్పట్లో సర్వే నిర్వహించేందుకు ప్రత్యేక బృందాలు రావాల్సి ఉండగా పారిశుధ్యం విషయంలో సెగ్రిగేషన్ షెడ్ నిర్వహణకు ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో అధికారులు వాంకిడిలో మాత్రమే మళ్లీ షెడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. సర్వే బృందం వచ్చి మార్కులు వేసి వెళ్లిన తర్వాత నిర్మాణం పూర్తి చేయకుండా అక్కడితోనే పనులు నిలిపివేశారు. ఐదు నెలలు గడిచినా నేటికీ షెడ్డు నిర్మాణ పనులు జరగడం లేదు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వదిలి ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.



వాంకిడిలో నూతనంగా నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్

కుప్పలుగా చెత్త..

వాంకిడి గ్రామ పంచాయతీ పరిధిలో ఈజీఎస్ నిధుల నుంచి నిర్మించిన చెత్తశుద్ధి కేంద్రం 2021లో వరదలకు కొట్టుకుపోయింది. అప్పటి నుంచి గ్రామంలో సేకరించిన చెత్తను చిక్లీ వాగు తీరంలో కుప్పలుగా డంప్ చేస్తున్నారు. రెండేళ్ల తర్వాత జీపీ నిధుల నుంచి మళ్లీ షెడ్డు నిర్మాణానికి జీపీలో తీర్మానం చేశారు. గత ఐదు నెలల క్రితం పనులు ప్రారంభించారు. ప్రస్తుతం షెడ్డులో సిమెంట్ ఫ్లోరింగ్, పెయింటింగ్ పనులు మిగిలి ఉన్నాయి. షెడ్డు నిర్మాణం అసంపూర్తిగానే ఉండటంతో గ్రామంలో సేకరించిన చెత్తను బయట పడేస్తున్నారు. కుప్పలుగా డంప్ చేసిన చెత్తకు నిప్పంటించి చేతులు దులుపుకుంటున్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై మధుకర్

కౌటాల: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. శనివారం కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడల్లో రాణించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థినులకు ఆపద ఉంటే షీటీంను సంప్రదించాలని సూచించారు. మైనర్ విద్యార్థులు బైక్‌లు నడపొద్దని, వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్‌గౌడ్, ప్రిన్సిపాల్ బాలకృష్ణ, అధ్యాపకులు రాము, శ్రీనివాస్ నాయక్, మోతిలాల్ నాయక్, రవీందర్, ప్రకాశ్, రాంబాబు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కౌటాల: వాహనదారులు రోడ్డు నియమనిబంధనలు పాటించాలని ఎస్సై మధుకర్ అన్నారు. శనివారం మండలంలోని ముత్తంపేట్ గ్రామ సమీపంలో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఇన్‌చార్జి జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. సమావేశంలో సభ్యులు మాట్లాడారు. వేసవికాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సర్పంచ్ శ్రీనివాస్ సభా దృష్టికి తీసుకొచ్చారు. ఐసీడీఎస్ పరిధిలో సేవలు అసంపూర్తిగా అందుతున్నాయని, ఎన్ని పోస్టులు ఖాళీ ఉన్నాయో తెలపాలని ఈజ్‌గాం సర్పంచ్ మల్లేశ్, ఎంపీటీసీ కుమార్‌లు ప్రశ్నించారు. గ్రామాల్లో అవసరమున్న చోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున సర్పంచ్‌లను సత్కరించారు. సమావేశంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, ఎంపీవో గౌరీశంకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సరోజ రాణి

వాంకిడి: మండలంలోని బండకాస గ్రామంలో శనివారం అటవీశాఖ డిప్యూటీ రేంజర్ సరోజ రాణి ఆధ్వర్యంలో అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి అడవుల సంరక్షణలో వన్యప్రాణుల ఆవశ్యకతను వివరించారు. జంతువులను వేటాడటం, విద్యుత్ తీగలు అమర్చడం, ఉచ్చులు బిగించడం వంటివి నేరమన్నారు. అడవుల సంరక్షణలో సహకరించాలని, ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవ్‌రావు, ఏఈవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత



బహుమతులు అందజేస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్

రెబ్బెన: గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని కొత్తపల్లి వెంకటలక్ష్మి -చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం మండలంలోని తుంగెడ జెడ్పీ హైస్కూల్‌లో బహుమతులు అందజేశారు. సొసైటీ వ్యవస్థాపకులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత దంపతులు మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు క్రీడా పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఉపాధ్యాయులు వినయ్‌కుమార్, సర్పంచ్ పెంటయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణకుమారి, జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూదరి హరీష్, బీఆర్‌ఎస్ నాయకులు జుమ్మిడి ఆనంద్, బీజేపీ మండల అధ్యక్షుడు గోలెం తిరుపతి, నాయకులు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

‘పట్టాలు పొందిన రైతులకు న్యాయం చేస్తాం’



రైతులతో మాట్లాడుతున్న విశ్వ ప్రసాద్‌రావు

రెబ్బెన: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమం ద్వారా పట్టాలు అందించిన పేద రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వ ప్రసాద్ రావు అన్నారు. శనివారం మండలంలోని తుంగెడ గ్రామంలో గతంలో ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామ పరిధిలోని నిరుపేదలు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వం సుమారు 200 ఎకరాల వరకు భూములను పంపిణీ చేసి పట్టాలు అందించిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణీ పోర్టల్ నుంచి పంపిణీ చేసిన భూములను తొలగించిందని మండిపడ్డారు. సదరు భూములను సాగు చేయకుండా అడ్డుకోవటంతో పేద రైతులు వ్యవసాయ కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు విన్న విశ్వప్రసాద్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ గతంలో అందజేసిన భూములకు ప్రస్తుతం కొత్త పాస్‌పుస్తకాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లావుడ్య రమేశ్, తుంగెడ మాజీ సర్పంచ్ గంటుమేర, నాయకులు డొంగ్రి తిరుపతి, పూదరి హరీశ్, మహేష్, మల్లయ్య, తులసీరాం పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఫిబ్రవరి 16వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌లో పాల్గొంటున్నట్లు అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ తెలిపారు. ఈమేరకు శనివారం జిల్లా కేంద్రంలో శిశు సంక్షేమ శాఖ అధికారి సావిత్రికి సమ్మె నోటీసు అందజేశారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి మాట్లాడుతూ సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. యూనియన్ నాయకులు వనిత, ధనలక్ష్మి, రాజమణి, చంద్రకళ, లక్ష్మి, జయ, సువర్ణ, మంజుల, కుమారి, తదితరులు ఉన్నారు.

పర్సువాడలో వైద్య శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలంలోని పర్సువాడ గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలన్నారు. ఆశ కార్యకర్తలు గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతికాన్పు ప్రభుత్వ ఆసుపత్రిలో అయ్యేలా చూడాలన్నారు. ఇందులో హెచ్ఈవో పవర్ రవీందర్, వైద్య సిబ్బంది ఉమామహేశ్వరి, గంగాదేవి, గీత, లక్ష్మి పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన



శిశువుకు టీకాలు వేస్తున్న ఏఎన్ఎం

వాంకిడి: మండలంలోని నవేగాం గ్రామంలో వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం గర్భిణీలు, బాలింతలకు టీకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలని, శిశువులు, గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్యుల సూచనల ప్రకారం టీకాలు వేయించుకోవాలని సిబ్బంది సూచించారు. కాన్పు సమయంలో ముందస్తుగానే ఆసుపత్రిలో చేరాలని, ఆసుపత్రుల్లో కాన్పు తల్లి, బిడ్డకు సురక్షితమన్నారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్, ఏఎన్ఎం కాంత, అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బీబ్రాలో క్రికెట్ పోటీలు

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామంలో ఆదివారం నుంచి బండ భవాని స్మారక క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సాయి, ఉమేశ్, శ్రీకర్ శనివారం తెలిపారు. వివరాలకు 8074620414, 7780338788 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు పంపిణీ చేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోయవాగు గ్రామంలో నిర్వహించిన గోల్డెన్ కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు శనివారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లెందుగురె శ్యాంరావు, బీఎస్పీ కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్‌హుస్సేన్‌లు బహుమతులు అందజేశారు. విన్నర్ జమీర్-11 జట్టుకు రూ. 30 వేలు, రన్నర్ ఫసీ-11 జట్టుకు రూ.15 వేల నగదుతో పాటు షీల్డులు అందజేశారు. నాయకులు రహెమాన్, ఇక్బాల్, గోపీ, మారుతి, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రిషియన్ డే



కేక్ కట్ చేస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఎలక్ట్రిషియన్ డే పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలో ఎలక్ట్రిషియన్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మొయినొద్దీన్ మాట్లాడుతూ ఏటా థామస్ అల్వా ఎడిషన్ బల్బ్ కనిపెట్టిన రోజును ఎలక్ట్రీషియన్ డేగా నిర్వహించుకుంటారన్నారు. పట్టణ అధ్యక్షుడు గంగన్న, ఉపాధ్యక్షుడు కాలు, సభ్యులు సురేశ్, మహ్మద్, సాయి, పవన్, సంతోష్ పాల్గొన్నారు.

రీడింగ్ రూం సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

రెబ్బెన: పాఠశాలలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లేతన్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్ అన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని శనివారం కమిటీ విద్యార్థులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా పాఠశాలలో ప్రత్యేక రీడింగ్ రూం ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల్లో మేథోశక్తిని పెంచే పుస్తకాలతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే ఎన్నో రకాల పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

మైకెల్ యార్క్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి

తిర్యాణి: ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేసిన మైకెల్ యార్క్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అన్నారు. మైకెల్ యార్క్ 80వ జన్మదినం సందర్భంగా శనివారం మండలంలోని గిన్నెదరి గ్రామంలో వేడుకలు నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను బయటి ప్రపంచానికి తెలిపిన మహనీయుడన్నారు. ఆదివాసీల జీవన స్థితిగతులపై డాక్యుమెంటరీ రూపొందించి బీబీసీలో ప్రసారం చేయించారన్నారు. సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గుణవంత్‌రావు, ఆదివాసీ సంఘాల నాయకులు సిడాం అర్జు మాస్టారు, జలపతి పటేల్, కుర్సింగ మోతిరాం, ఆత్రం సంతోష్ తదితరులు ఉన్నారు.

ఆహ్లాదకరంగా పోలీస్‌స్టేషన్





సిర్పూర్(టి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణ పచ్చదనంతో కళకళలాడుతోంది. పోలీస్‌స్టేషన్ ఆవరణలోని ఖాళీ స్థలాన్ని చదును చేయించి మొక్కలు పెంచుతున్నారు. ఆవరణలో నాటిన మొక్కలకు పూలు పూస్తుండటంతో పోలీసుస్టేషన్ ఆవరణ ఆహ్లాదకరంగా మారింది. ఎస్సై దీకొండ రమేశ్ ప్రత్యేక చొరవ తీసుకొని పూల మొక్కలతో పాటు పండ్ల మొక్కలు నాటి వాటి సంరక్షణ సైతం స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం మొక్కలకు నీటిని అందిస్తూ మొక్కల పెంపకంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. పూలు, పండ్ల మొక్కలను కాగజ్‌నగర్, మంచిర్యాల, హైదరాబాద్ పట్టణాల నుంచి తెప్పించి పెంచుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన హరితహారంలో భాగంగా స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్ వెనుక భాగంలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, గుంతలను మొరంతో నింపి వివిధ రకాల మొక్కలు నాటారు.